ఆర్టీసీకి ఆటో పోటు!

ఆటోలు, సిటీ బస్సులతో ఆర్టీసీ ఆదాయానికి భారీ గండి

- నేరుగా బస్టాండ్ వద్ద నుంచే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వైనం
- నగరంలోని బస్‌స్టాప్‌ల వద్ద నిలబెట్టి మరీ సర్వీసులు
- కనీసం పట్టించుకోని ఆర్టీఏ, ఆర్టీసీ అధికారులు

పట్నంబజారు: నిత్యం నష్టాల ఊబిలో నడుస్తున్న ఏపీఎస్ ఆర్టీసీకి ప్రైవేట్ వాహనాల తీరు మరింత తలపోటు తెచ్చి పెడుతోంది. జిల్లా పరిధిలోని గుంటూరు డిపో 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో మొత్తం 369 బస్సులు ఉండగా, వాటిలో సుమారు 90కి పైగా హైర్ బస్సులు ఉన్నాయి. గుంటూరు బస్టాండ్ నిత్యం వేలాది మంది ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అయితే సిటీ బస్సులు, ఆటోల వలన ఆర్టీసీ ఆదాయానికి తీవ్రంగా గండి పడుతోంది. గుంటూరు రీజియన్ పరిధిలో సుమారు ఆర్టీసీ ఆదాయం టార్గెట్ రూ.62లక్షల ఉంది. అయితే కేవలం రూ 50లక్షలు మాత్రమే ఆదాయం సమకూరుతోంది. వీటికి ప్రధాన కారణంగా ఆటోలు, సిటీ బస్సులు అనే చెప్పుకోవచ్చు. ప్రైవేట్ బస్సుల వలన వస్తున్న నష్టంతో పాటు సిటీ బస్సులు, ఆటోల కారణంగా నిత్యం రూ 3లక్షల నుంచి రూ 4లక్షల వరకు నష్టం వాటిల్లుతోందని అభిప్రాయపడుతున్నారు.


పల్నాడు బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోవాలాలు

నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోరా..?

ఆర్టీసీ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి ప్రైవేట్ వాహనాలు నిలవకూడదన్నది మోటార్ వెహికల్ చట్టం నిబంధన. అయినప్పటికీ గుంటూరు నగరంలో సిటీ బస్సుల యాజమాన్యాలు, ఆటోవాలాలు వీటికి తిలోదకాలిచ్చేశారు. నేరుగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు, యనమదల, ఫిరంగిపురం, మేడికొండూరు, పేరేచర్ల, నంబూరు, చేబ్రోలు వరకు సిటీ బస్సులు తిరుగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రతి సోమవారం కాకాని తోటకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఆ రోజున సైతం ఆటోవాలాలు, సిటీ బస్సులు బస్టాండ్ వద్దే ఎక్కించుకుని ఆదాయానికి గండి కొడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువైపోయాడు. నిబంధనలకు తిలోదకాలిస్తే.. పట్టించుకోవాల్సిన ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న సమయంలో చూడాల్సిన పోలీసులు కళ్లుండీ చూడలేని విధంగా వ్యవహరిస్తున్నారు.

నేరుగా బస్‌స్టాప్‌ల వద్దే..

ఆర్టీసీ బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రయాణికులకు ఎక్కించుకునేందుకు నగరంలో పలు బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేశారు. పల్నాడు బస్టాండ్ సెంటర్ మీదుగా నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ ప్రాంతాలవైపు అనేక బస్సులు తిరుగుతుంటాయి. అయితే ఇక్కడ కూడా ఆటోలను అడ్డుగోలుగా నిలబెట్టి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు.


ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్స్ బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోవాలాలు

- అమరావతి, తాడికొండ, తుళ్లూరుతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సంబంధించి ఉన్న ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్స్, లాడ్జిసెంటర్, తాలూకా సెంటర్ ప్రాంతాల్లో కూడా బస్సుల కంటే ముందుగా ప్రయాణికులకు ఎక్కించుకుని వెళ్లిపోతున్న పరిస్థితులు ఉన్నాయి.
- నంది వెలుగు రోడ్డులో అయితే నేరుగా బస్టాండ్ అవుట్‌గేట్ వద్దనే అప్పీ ఆటోల స్టాండ్ వెలిసింది. బస్టాండ్ ముందే ప్రయాణికులకు ఎక్కించుకుని తెనాలి వరకు తీసుకుని వెళుతున్న పరిస్థితులు ఉన్నాయి. గతంలో ఆర్టీసీ పరిరక్షణ సమితి కమిటీగా ఏర్పడి ప్రైవేట్ అరచకాలను అడ్డుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్టీసీ, ఆర్టీఏ అధికారులు సిటీ బస్సులు, ఆటోలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఆర్టీసీ మరింత నష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు.

ఆర్ఐ పోస్టుకు సిఫారసుల వెల్లువ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు చేపడుతున్న సమాచారం తెలుసుకున్న ఉద్యోగులు ఎలాగైన ఆర్ఐ (రెవెనూ ఇన్‌స్పెక్టర్) పోస్టు దక్కించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తొమ్మిది ఆర్ఐ పోస్టులు ఉన్నాయి. ఆర్ఓలు(రెవెన్యూ ఆఫీసర్) నాలుగు పోస్టులు ఉన్నాయి.

ఇంటి పన్ను వేయాలన్నా, ఇంటి పన్ను పేరు మార్చాలన్నా, ఒక్కో ఆర్ఐ ఇంటి పరిమాణం బట్టి రూ.10వేల నుంచి లక్షల్లో డిమాండ్ చేస్తుంటారని భోగట్టా. వచ్చిన దాంట్లో కిందనుంచి పై స్థాయి వరకు పంచుకుంటు పోతుంటారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అంతర్గత బదిలీలు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టడంతో ఎలాగైన ఆర్ఐ పోస్టుకు దక్కించుకోవాలని ఆశావాహులు ఆరాటపడుతున్నారు. డిమాండ్ ఉన్న పోస్టు కావడంతో ఒక్కో ఆర్ఐ పోస్టుకు ముగ్గురు, నలుగురు పోటీ పడుతున్నట్లు సమాచారం . ఇప్పటికే ఆశావహులు ఎమ్మెల్యేల దగ్గర నుంచి సిఫారసు లేఖలు తీసుకుని కమిషనర్‌కు అందజేసినట్లు కార్పొరేషన్ కార్యాలయంలో చెప్పుకొంటున్నారు. దీంతో పాటు ఆర్ఓ పోస్టులకు కూడా సూపరింటెండెంట్‌లు భారీ స్థాయిలో పైరవీలు నడిపిస్తున్నట్లు కార్యాలయంలో గుప్పుమంటోంది.

క్లుప్తంగా

విశాఖ ఉక్కు పరిరక్షణకు దశలవారీ ఆందోళనలు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారంపై అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా అక్టోబర్ 1,2,3 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఏఐటీయూసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు



పట్నంబజారు: దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోని లాలాపేట వేంకటేశ్వరస్వామి, నాజ్‌సెంటర్ ఆంజనేయస్వామి, జగన్నాథ స్వామి ఆలయాల్లోని హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయాల కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాస్, పాలకమండలి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.4,25,559, నాజ్‌సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.3,01,469, జగన్నాథస్వామి ఆలయానికి రూ 8,464 కలిపి మొత్తం రూ 7,35,492 ఆదాయం గ్రూపు ఆలయాలకు సమకూరినట్లు తెలిపారు.

పని భద్రత కల్పించాలి



లక్ష్మీపురం: ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా ఉన్న సివిల్ సప్లయీస్ ముఠా కార్మికులకు పని భద్రత కల్పించడంలో ప్రభుత్వం సివిల్ సప్లయీస్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబించడంపై యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మరియదాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సివిల్ సప్లయీస్ గోదాము వద్ద రాష్ట్రసమితి ఏఐటీయూసీ పిలుపులో భాగంగా రెండోవరోజు గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కావుల అంజిబాబు, పానం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

29న మోడల్ టెట్

గుంటూరు ఎడ్యుకేషన్: యునైటెడ్ యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (యూవైడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో ఈనెల 29న మోడల్ టెట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిన్నింటి బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 2/11లోని కాంపిటీషన్ సక్సెస్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పేపర్-1, పేపర్-2 ద్వారా రాష్ట్రస్థాయిలో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మోడల్ టెట్‌కు హాజరయ్యేందుకు 9603669032 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలు



లక్ష్మీపురం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగువాడిగా పుట్టడం తెలుగు వాళ్ళు చేసుకున్న పూర్వ జన్మ సుకృతమని 16 భాషాల్లో పాటలు పాడటమే కాకుండా రోజుకు 21 పాటలను రికార్డు చేయగల సత్తా బాలుదని ప్రముఖ నాటక రచయిత బి.వి.రామ్‌కుమార్, అవగాహన సంస్థకార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సంస్థ మనమూ పాడుదాం బృందం ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం సంస్థ సభ్యులు, పాడుదాం రండి బృందం బాలు పాటలను ఆలపించారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా ఎంపికలు

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు బాల, బాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ ఎంపికలు జరిగాయి. పాఠశాలల పీడీలు, పీఈటీల సమక్షంలో విద్యార్థులు పోటీల్లో అదరగొట్టారు. ఆయా క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి జట్లును ఎంపిక చేశారు. పోటీలను వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి పరిశీలించి అనంతరం క్రీడాకారులతో మాట్లాడారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

- 22వ రోజు దీక్షలో సీఐటీయూ నేతల మద్దతు
- జీఓ 115 రద్దు చేసేవరకు నిరసన కొనసాగుతోందని వెల్లడి


గుంటూరు జీజీహెచ్ ఆవరణలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు గురువారం విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట తమ నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లు పట్టించుకోవాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబరు 115ను రద్దు చేయాలని, తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మద్దతు

గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన కార్యక్రమానికి సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. ఈమేరకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ నిరసన దీక్షా శిబిరానికి చేరుకుని తమ మద్దతు ప్రకటించారు. ఈనెల 30న దేశవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో తాము నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి స్టాఫ్‌నర్సులు కూడా హాజరై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

సమాజమే జాషువా కవిత్వానికి ఇతివృత్తం

దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్

నగరంపాలెం: సమాజంలో బాధితుడి నుంచి అగ్రగణ్యుడిగా ఎదిగిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం నగరంపాలెంలోని మహాకవి గుర్రం జాషువా విగ్రహం వద్ద జాషువా సాహిత్యం - జీవితం అంశంపై సభ నిర్వహించారు. సభకు తెనాలి ప్రభుత్వ సహాయక న్యాయవాది సుద్దపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొరివి వినయకుమార్ మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా ఆకలి, అంటరానితనం అనుభవించారని, ఆయన దిగువస్థాయి వ్యక్తి దృక్పథం నుంచి సమాజాన్ని దర్శించి కవిత్వాన్ని రాశారని అన్నారు.

జాషువా తెలుగు, సంస్కృత భాషల్లో పండితుడిగా, ఉభయ భాషా ప్రవీణ డిప్లొమా పొందారని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా ఒక కవిగానే గాక తెలుగు భాషా సాంస్కృతిక ప్రతినిధి అని ప్రశంసించారు. ఆయన పద్యాలు పండితులే గాక పామరులు కూడా అలవోకగా పాడగలడం జాషువా గొప్పదనమన్నారు. హైకోర్టు న్యాయవాది గద్దం ఎలీషా మాట్లాడుతూ గుర్రం జాషువా జీవితాన్నే సాహిత్యంగా మలిచారని అన్నారు. కాపు నాయకులు మాదా రాధ, లైబ్రేరియన్ సోపాటి రమేష్, మహిళా న్యాయవాది పరిశపోగు అపర్ణా దేవి, నాయకులు చంద్రపాల్, జెట్టి బాబురావు, గుర్రాల వెంకటేశ్వర్లు, ప్రముఖ హార్మోనిస్ట్ సలీం బాబు, హైకోర్టు న్యాయవాది గద్దం ఎలీషాను నిర్వాహకులు సన్మానించారు. సభలో ఎంజేజేఎస్ ఉపాధ్యక్షుడు కోట మోహన్‌రావు, సహాయ కార్యదర్శి కందుల ప్రసాదరావు, దాసరి జాన్‌బాబు, అత్తోట జోసెఫ్, వెంకటరత్నం, నిర్వాహకులు పుసులూరి విజయ్‌కుమార్, గోనె లూథర్‌పాల్, న్యాయవాది వీరమణి పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

నెహ్రూనగర్: గుంటూరు చంద్రమౌళి నగర్‌లో చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ దోబీ మహాసంగ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. అటువంటి మహనీయురాలి విగ్రహావిష్కరణ గుంటూరులో జరగటం ఆనందంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో అండర్-14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలను గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించారు. పరుగు పందెంతో పాటు షాట్‌పుట్, డిస్క్‌త్రో, హైజంప్, 100 మీటర్ల హర్డిల్స్ పోటీలను నిర్వహించినట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ తెలిపారు. పోటీలను పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.భాను మురళీధర్ ప్రారంభించారు. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని శివాజీ పేర్కొన్నారు. పోటీలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మొహమ్మద్ బాషా, వివిధ పాఠశాలల వ్యాయామ అధ్యాపకులు ప్రభాకర్, రాజేంద్ర ప్రసాద్, విజయకుమార్, శ్రీనివాసరావు, శంకర్, అప్పారావు, సాయిబాబా, అంథోనీ, రాజేశ్వరి, అంజుబాయ్, సీత, శాంతకుమారి, జోస్పిన్, సామ్రాజ్యం, శివకుమారి, రవి శేఖర్, భరత్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన

నగరంపాలెం: నీటి సంరక్షణ, మొక్కల పెంపకం వంటి స్థిరమైన పద్ధతులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ది గుంటూరు డయాసిస్ సోషల్ సర్వీస్, వెల్ఫేర్ సొసైటీ (జీడీఎస్ఎస్, డబ్ల్యూఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవ.ఫాదర్ ఉన్నం కిరణ్‌కుమార్ అన్నారు. 2024 సీజన్‌లో భాగంగా జీడీఎస్ఎస్, డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో బొంగరాలబీడు సెయింట్ లూర్ధు ఉన్నత పాఠశాలలో గురువారం సేవ్ అవర్ మదర్‌ఎర్త్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కలిస్తామని అన్నారు. అదే విధంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు వెళ్లేలా ప్రోత్సహించడం సొసైటి ధ్యేయమని చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన లూర్ధు పాఠశాల ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణం, మొక్కలు పెంపకం, నీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

చేబ్రోలు: యూటీఎఫ్ చేబ్రోలు మండల స్వర్ణోత్సవ మహాసభ ఈ నెల 28వ తేదీన జరుగుతుందని ఉపాధ్యాయ సంఘ నాయకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆహ్వాన పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. గత ఏడాది కాలంలో పని విధానాన్ని సమీక్షించుకొని నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీచింగ్ ఎక్సలెన్సీ అవార్డ్స్ -2024 పేరుతో ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించటానికి కృషి చేసిన 18మంది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించటం జరుగుతుందని వారు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.రమేష్‌బాబు, డి.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: రెండు రోజుల క్రితం కురిసిన భారీవర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న కామాక్షినగర్ గంగిరెద్దుకాలనీలోని పేద కుటుంబాలకు అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈసందర్భంగా యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవిస్తున్న 20 కుటుంబాలకు చెందిన 70 మంది భారీ వర్షాల కారణంగా తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్న విషయమై బహుజన సేవా సమితి అధ్యక్షుడు జీఆర్ భగత్‌సింగ్ ద్వారా తెలుసుకుని 100 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. జీఆర్ భగత్‌సింగ్, రాష్ట్ర రజకుల సంఘ నాయకుడు శివన్నారాయణ, అప్సా ప్రతినిధి శ్రీనాథ్ పాల్గొన్నారు.



నిబంధనల మేరకే నిర్మాణాలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు
- నగరంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల నిర్మాణాల పరిశీలన


భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తులను నిర్దేశిత నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణం చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ శ్యామలనగర్ మెయిన్ రోడ్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్‌ల కొలతలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు జరగాలని, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలో అనధికార, ప్లాన్‌కి భిన్నంగా, జరిగే నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎల్‌టీపీలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, టీపీఎస్ రిజ్వాన, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరుకు కృషి

నగర ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుంటూరుకు కృషి చేస్తున్నామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. గురువారం పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాల్లో మోడల్‌గా అభివృద్ధి చేయనున్న 49వ డివిజన్‌లోని కొండయ్య కాలనీ, వేళాంగిణి నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గల్లా మాధవి, అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత కోసం చేపట్టే కార్యక్రమాల్లో నగర ప్రజలను, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలను, విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని పరిశుభ్ర నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు కూడా కృషి చేస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఎస్ ఆనంద కుమార్, ఏఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐజాక్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

డీఆర్ఎం కార్యాలయంలో మెగా శ్రమదాన్


మెగా శ్రమదాన్‌లో పాల్గొన్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత అనే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి 10వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సేవల మెగా శ్రమదాన్‌ను నిర్వహించడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం మెగ శ్రమదాన్ కార్యక్రమాన్ని డీఆర్ఎం ప్రారంభించి సిబ్బందితో కలిసి స్వయంగా పాల్గొని కార్యాలయ ప్రాంగణం అంతా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రతి రైల్వేస్టేషన్, కార్యాలయ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రయాణికులు, సందర్శకులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్టాల్స్‌ను, ప్యాంట్రీ కార్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏడీఆర్ఎం కె.సైమన్, సీపీఎం డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం సిహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్వహణను విస్మరించారు

- వ్యర్థాలకు నిలయంగా లాడ్జిసెంటర్ అంబేడ్కర్ విగ్రహం సర్కిల్
- గేట్లు విరిగిపోయి, రాత్రిళ్లు అసాంఘిక వ్యక్తులకు నిలయంగా మారుతున్న వైనం


అంబేడ్కర్ సర్కిల్ వద్ద గేటు విరిగిపోయిన దృశ్యం

నెహ్రూనగర్: లాడ్జిసెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్వహణను అధికారులు పూర్తిగా విస్మరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం, ఏర్పాటు, నిర్వహణకు కొన్ని లక్షలు వెచ్చించింది. గ్రీనరీ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ మార్బుల్, ఇతర హంగులతో పూర్తిస్థాయిలో ఆధునికీకరించి.. దానికి అంబేడ్కర్ సర్కిల్ సెంటర్‌గా పేరు మార్చింది. అయితే నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ సర్కిల్ సెంటర్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన గేటు ధ్వంసం అయింది. రాత్రిళ్లు కొంతమంది వ్యక్తులు అక్కడ చేరి అపరిశుభ్రం చేయడంతో పాటు అక్కడే గుట్కాలు తిని ఉమ్మివేయడం, తినేసిన ప్లేట్లు వేయడం వంటివి చేయడం ద్వారా విగ్రహం ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోయి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబేడ్కర్ సర్కిల్ సెంటర్ నిర్వహణను పట్టించుకుని రాత్రిళ్లలోనికి ఎవరూ వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


వ్యర్థాలతో మురుగు కాలువను తలపిస్తున్న ఫౌంటెయిన్